ప్రజాశక్తి

సోమవారం 28 అక్టోబర్ 2024   8 పేజీలు



గుంటూరు



పల్నాడు



రబీలో అత్యధికంగా సాగయ్యే మొక్కజొన్న పైరు (ఫైల్)

ధీమా లేని బీమా

- సాగు ప్రారంభం ముందే గడువు ముగింపు
- రబీ నుంచి అమలుకు సన్నాహాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పంట బీమా లేకుండా ఖరీఫ్ సీజన్ ముగిసింది. తాజాగా రబీ సీజన్ నుంచి పంటల బీమా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి. ఎకరాకు పంట విలువపై రెండు శాతం సొమ్ము రైతులు చెల్లించాలి. సగటున వచ్చే ఉత్పత్తి విలువ వరికి రూ.41 వేలుగా నిర్ణయించారు. దీని ప్రకారం రెండు శాతం అంటే రూ.820 చెల్లించాలి. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం వాటా అంటే రూ.205 చెల్లిస్తే మిగతా 1.5 శాతం వాటా రూ.615 రైతులే చెల్లించాలి.

జిల్లాలోని 2 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. ప్రధానంగా ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు రెండో పంటగా జొన్న, మొక్కజొన్న, శనగ, మినుము, పెసర తదితర పంటలను రబీలో సాగు చేస్తారు. పంటల బీమా రూపంలో రైతులపై రూ. 12.30 కోట్ల భారం పడనుంది. అయితే ప్రస్తుతం రబీ సీజన్‌లో రెండో పంట వేసే వారు డిసెంబరు చివరి వారంలో రబీకి శ్రీకారం చుడతారు. అయితే ప్రభుత్వం డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించింది. సచివాలయాలు, కామన్ సర్వీసు సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించాలని నిర్దేశించారు. ఖరీఫ్‌లో ఎటువంటి పంటలు సాగు చేయకుండా ఖాళీగా

▶ 2లో

బీమా ప్రీమియం గడువు పెంచాలి : రైతుసంఘం

ప్రధాన మంత్రి ఫసల్ బీమా వల్ల ఉపయోగం లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ఖరీఫ్‌లో బీమా ఊసేఎత్తలేదన్నారు. రబీలో మాత్రం డిసెంబరు 15 చివరి తేదీని జనవరి 15 వరకు పొడిగించాలన్నారు. ప్రభుత్వం అన్ని పంటలకు బీమా వర్తింప చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఉత్పత్తి అంచనాల ప్రకారం బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం పంట ఎదుగుదల, కాపు ప్రాతిపదికన కాకుండా ఉత్పత్తి అంచనాల ప్రకారం సాయం అందించాలన్నారు.



అప్పుడు కడుపు కొట్టి.. ఇప్పుడు కేసులు పెట్టి..

- ఫ్యాక్టరీ భూముల్లోకి ఏసీసీ కార్మికులు కదం.. జెండాలు పాతి న్యాయం కోసం నినాదం..
- తాడోపేడో తేల్చుకునే వరకూ పోరాడతామని ప్రతిజ్ఞ - కార్మికులు, నాయకులపై కేసులు



ఫ్యాక్టరీ భూముల్లో గుడిసెలు వేసేందుకు కర్రలను సిద్ధం చేసుకుంటున్న కార్మికులు, వారి కుటుంబీకులు

అప్పుడు కడుపుపై కొట్టారు.. ఇప్పుడు కొట్టబోయారంటూ కేసులు పెట్టారు.. 160 మందిని ఆకలి చావులకు గురి చేశారు... ఇప్పుడు చంపుతామని బెదిరించారంటూ కేసులు బనాయించారు.. అక్రమ లాకౌట్ వల్ల అన్యాయానికి గురైన కార్మికులు దశాబ్ధాలుగా పోరాడుతున్నా యాజమాన్యం పట్టించుకో లేదు. న్యాయం చేయాలని ఏళ్ల తరబడి వేడుకున్నా పాలకులకూ పట్టలేదు. కడుపు మండిన కార్మికులు తమకు హక్కుగా రావాల్సిన వాటా కోసం, కోర్టు తిర్పునిచ్చిన పరిహారం కోసం కంపెనీ భూముల్లోకి వెళ్లగా పోలీసులను ఉసిగొల్పారు. అన్యాయానికి గురైన కార్మికులతోపాటు వారికి అండగా నిలిచిన నాయకుల మీద పలు రకాల సెక్షన్ల కింద 20 మందిపై కేసులు పెట్టారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లిలోని ఎసిసి కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దశాబ్ధాలుగా చేస్తున్న పోరాటం మరో దశకు చేరింది. తమకు రావాల్సిన పరిహారం కోసం ఆదివారం ఫ్యాక్టరీ భూముల్లోకి కదం తొక్కారు. అక్కడే గుడిసెలు వేసేందుకు సిద్ధమయ్యారు. వీరికి అనేక కార్మిక సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఈ సందర్భంగా సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి మాట్లాడుతూ కార్మికులు అడుగుతోంది భిక్ష కాదని, హక్కని చెప్పారు. కష్టార్జితం కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నారని, అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడంతో ఫ్యాక్టరీ భూముల్లోకి వచ్చారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని విమర్శించారు. చట్ట ప్రకారం కార్మికులకు రావాల్సిన పరిహారాన్ని ప్రభుత్వంలో ఉన్నవారు ఇప్పటించకుంటే ఇంకెవరు ఇప్పిస్తారని ప్రశ్నించారు. కార్మికుల పక్షమో, యాజమాన్య పక్షమో ప్రభుత్వం తేల్చుకోవాలన్నారు. కార్మికులు కడుపు మంటతో గొంతు చించుకున్నా.. అర్ధాకలితో చనిపోయినా యాజమాన్యం, ప్రభుత్వంలో ఉలకూ పలుకూ ఎందుకు లేదని నిలదీశారు. కార్మికులకు సిఐటియు పూర్తి అండగా నిలుస్తుందని, ఇతర

▶ 2లో



ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పాతుతున్న కార్మికులు, వారి కుటుంబీకులు

సాగర్‌కు తగ్గిన నీటి ఉధృతి - 2 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జునసాగర్ జలాశయానికి వరద ఉధృతి తగ్గినా ప్రవాహం మాత్రం కొనసాగుతుండడంతో డ్యాం అధికారులు రెండు క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 16,138 క్యూసెక్కుల నీటిని దిగకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుండి 64,472 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. నాగార్జున సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 589.70 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 311.1486 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,394 క్యూసెక్కులను, కుడి



కాల్వ ద్వారా 9967 క్యూసెక్కులను, ఎడమ కాల్వద్వారా 6173 క్యూసెక్కులను, ఎస్-ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులను, లోలెవల్ కెనాల్ ద్వారా 400 క్యూసెక్కుల, మొత్తంగా రిజర్వాయర్ నుండి 64,472 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



కళ్యాణ్ మృతదేహం, (ఫైల్‌ఫోటో)

సూర్యలంకలో గుంటూరు యువకుడు మృతి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి : గుంటూరుకు చెందిన యువకుడు సూర్యలంక సముద్రతీరంలో అలల ధాటికి మృత్యువాత పడిన ఘటన ఆదివారం జరిగింది. గుంటూరు కొత్తపేటకు చెందిన రేషి కళ్యాణ్ (20) కుటుంబీకులు సూర్యంక సముద్ర తీరానికి వెళ్లారు. సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలకు ధాటికి కళ్యాణ్ సముద్రంలో మునిగి పోయాడు. అలలు ఉరవడికి లోపలికి కొట్టుకుపోయి మృతి చెందాడు. మృత దేహాన్ని బాపట్ల ఏరియా వైద్యాశాలకు తరలించారు.గుంటూరు కొత్తపేట వారి నివాసం వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆడుకుందామని వచ్చి.. చావు నోటికి చిక్కి

కృష్ణానదిలో మునిగి విద్యార్థి, యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆడుకోవడానికి వెళ్తున్నామని చెప్పి ఇంటి నుండి వచ్చిన యువకులు ఎంతసేపటికీ రాకపోవడం,

▶ 2లో



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు.. ఇన్‌సెట్‌లో హేమంత్‌కుమార్ దుర్గాప్రసాద్ మృతదేహాలు

బాణసంచా గిడ్డంగులను తనిఖీ చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దీపావళి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా దుకాణదారులు, గోడౌన్లు వద్ద భద్రత ప్రమాణాలను పాటించాలని, అగ్ని మాపక శాఖాధికారులతోపాటు కలిసి పరిశీలించి భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని అధికారులను జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లను తనిఖీ చేయాలని, లైసెన్సులను పరిశీలించాలని సూచించారు. ప్రతిఒక్కరూ భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనధికారంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు సంబంధించిన సమాచారం ఉంటే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8688831568 గాని 100,కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

ధీమా లేని బీమా

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న భూముల్లోనే రబీ పంటల సాగు గత వారమే ప్రారంభమైంది. వీరిలో కొద్ది మంది వరి సాగు చేయగా మిగతా వారు శనగ, పెసర, మినుము తదితర పంటలను సాగు చేశారు. గతేడాది రబీలో 1.50 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగింది. ఈఏడాది మరికొంత విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన తరువాత రెండో పంటగా కొంత మంది ఎటువంటి పంటలు వేయలేదు. గత ఏడాది సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో జొన్న, మొక్కజొన్నకు నీరు ఇవ్వలేమని ప్రకటించారు. దీంతో ఎక్కువ మంది ఈ రెండు రకాల పంటలను సాగు చేయకపోవడంతో సాధారణ విస్తీర్ణం కంటే సాగు తగ్గింది. ఈ ఏడాది నీరు అందుబాటులో ఉండటం, ఇప్పటి వరకు సాగర్ జలాశయం పూర్తి నిండుకుండగా ఉండటం వల్ల నీటి ఎద్దడి లేకపోవడం వల్ల 1.80 లక్షల ఎకరాల్లో సాగు జరగుతుందని భావిస్తున్నారు. ప్రధానంగా ఇప్పటి వరకు ఎటువంటి పంటలు వేయకుండా ఖాళీగా ఉన్న 40 వేల ఎకరాల భూముల్లో అపరాలు సాగు ప్రారంభించారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన దాదాపు 1.40 లక్షల ఎకరాల్లో డిసెంబరు చివరి వారంలో లేక జనవరిలో పంట నూర్పిడి తరువాతనే రబీ సాగు జరిగే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన తేదీకి రబీ పంటలకు బీమా ప్రీమియం చెల్లింపు సాధ్యం కాదని రైతులు చెబుతున్నారు.

ఆడుకుంటామని వచ్చి.. చావు నోటికి చిక్కి

(మొదటి పేజీ తరువాయి)

ఆపైన వారి మరణ వార్త తెలియడంతో రెండు కుటుంబాలు తల్లడిల్లాయి. తాడేపల్లిలోని కృష్ణానది పుష్కరఘాట్‌ల వద్ద నీటిలో మునిగి ఇద్దరు యువకులు మృత్యువాత పడిన ఘటనా ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు, మృతుల బంధువుల కథనం ప్రకారం.. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేట, అరుణోదయ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు ఆదివారం సెలవుల కావడంతో ఆడుకోవడానికి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి కృష్ణానదికి వచ్చారు. రైలు బ్రిడ్జి సమీపంలో పుష్కర ఘాట్‌ల స్నేహితులంతా స్నానం చేస్తుండగా సుడిగుండాల కారణంగా చివుకు హేమంత్ కుమార్ (17), గుడివాడ దుర్గాప్రసాద్ (23) మునిగిపోయారు. ఇది గమనించిన మిగతా స్నేహితులు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న మత్స్యకారులు వచ్చి వారిని వెలుపలికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందారు. మత్స్యకారుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఇది తెలిసిన మృతుల కుటుంబీకులు, బంధువులు బోరున విలపిస్తూ ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడు హేమంత్ విజయవాడలోని ఎన్‌ఆర్‌ఐ కాలేజీలో ఇంటర్ (బైపిసి) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. తల్లి, సోదరి ఉన్నారు. మరో మృతుడు దుర్గాప్రసాద్ వికలాంగుడు కాగా తండ్రి ప్రైవేటు ఎలక్ట్రీషియన్. దుర్గాప్రసాద్ కూడా అదేపని నేర్చుకుంటున్నాడు. తల్లి, సోదరి ఉన్నారు. ఈ రెండు కుటుంబాల్లోనూ మృతులే ఒక్కగానొక్క కుమారులు కావడం గమనార్హం.

అప్పుడు కడుపు కొట్టి.. ఇప్పుడు కేసులు పెట్టి..

(మొదటి పేజీ తరువాయి)

కార్మిక సంఘాలూ మద్దతిస్తున్నాయని, తాడోపేడో తేల్చుకునే వరకూ పోరాటం కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిపిఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతిస్తుందని చెప్పారు. నష్టపరిహారమైన ఇవ్వాలి, భూములైన ఇవ్వాలి, తేల్చుకునేదాకా కార్మికులు భూముల నుండి కదల వద్దన్నారు. సిపిఐ (ఎంఎల్) నాయకులు స్వామి మాట్లాడుతూ పాలక పార్టీలు యజమానుల పక్షమా-కార్మికుల పక్షమా తేలే సమయం ఆసన్నమైందన్నారు. ఇంతకాలం కార్మికులు చేసిన పోరాటం చారిత్రాత్మకమైందని, వారికి తమ పూర్తి అండదండలు ఉంటాయని చెప్పారు.

ముందుగా వందలాది మంది కార్మికులు తమ కుటుంబాలతో సహా యూనియన్ కార్యాలయం నుండి ఫ్యాక్టరీ భూముల్లోకి ప్రదర్శనగా వచ్చారు. ఒక చంకలో చంటి పిల్లలను ఎత్తుకుని మరో చేత్తో జెండాలను ఆ భూముల్లో పాతారు. న్యాయం జరిగేదాక ఇక్కడే పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. మరోవైపు కార్మికులు భూముల్లోకి రాకముందే ఎపిఎస్‌పి పోలీసులు ఎసిసి భూములున్న బ్రహ్మానందపురంలో పెద్ద ఎత్తున కవాతు చేశారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేద్దామని వారు భావించినా వాటికి కార్మికులు వెరవలేదు. నష్టపరిహారమైనా ఇవ్వండి, భూములైనా ఇవ్వండని నినదిస్తూ తమ ఆందోళన కొనసాగించారు. కార్యక్రమంలో తాడేపల్లి రూరల్, పట్టణ కార్యదర్శులు డి.వెంకటరెడ్డి, బి.వెంకటేశ్వర్లు, నాయకులు వి.దుర్గారావు, డి.శ్రీనివాసకుమారి, కె.కరుణాకర్‌రావు, ఎం.శ్రీనివాసరెడ్డి, సిపిఐ నాయకులు కె.కాశయ్య, టి.వెంకటయ్య, సిపిఐ (ఎంఎల్) నాయకులు యు.నాగేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు చెన్నయ్య పాల్గొన్నారు.


భూముల్లో కార్మికులు, నాయకులు


మాట్లాడుతున్న నేతాజి

సమాజానికి సాహిత్య సంస్థలు అవసరం

జానపద అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సమాజం..సాహిత్యం ఉన్నతికి సాహిత్య సంస్థల అవసరం ఎంతో ఉందని జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ అన్నారు. లేపాక్షి ఫౌండేషన్ ఆవిష్కరణోత్సవం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని అనంతపురం ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు కలిసి సాహిత్యం, సమాజ ప్రగతి కోసం ఈ ఫౌండేషన్ ను స్థాపించడాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి సంస్థలు మరిన్ని ఏర్పాటు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇతర సాహిత్య సేవా సంస్థలను కలుపుకుంటూ ముందుకుసాగాలని కళా పోషకులు గోళ్ల నారాయణరావు సూచించారు. లేపాక్షి ఫౌండేషన్ స్థాపించిన ఉద్దేశ్యాన్ని అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు మద్దుల విజయలక్ష్మి ప్రశంసించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలని, అవరోధాలను విజయాలకు సోపానాలుగా మలచుకోవాలని తెలుగు భాష సేవారత్న గణేష్ బోణం అన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన కవులు తమ రచనలను ఫౌండేషన్ ఆవిష్కరణ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో చదివి వినిపించారు. వారిని అతిథులు, నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వడ్డి సుధాకర్, డి.శ్రీనివాసులు, చిన్నారి అనిల్, జి.అశోక్‌లతో పాటు పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

బాబోయ్ ఇసుక ధరలు

- లారీ రూ.35 వేలు
- ట్రాక్టర్ రూ. 7 వేలు
- పనుల్లేక కార్మికుల ఇబ్బందులు



ప్రజాశక్తి- గన్నవరం : ఇసుక రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చెబుతున్న మాటలకు ఆచరణకు చాలా తేడా కనిపిస్తుంది. బాబోయ్ ఇసుక ధరలు అన్న పరిస్థితి ఉంది. దీంతో భవన నిర్మాణాలు ఆగాయి. కార్మికులకు పనులు లేక ఇబ్బం దులు పడుతున్నారు. వరదల పేరుతో ఇసుక రీచ్లను మూత పడ్డాయి. వరదలు తగ్గి ఇసుక రీచ్ లు తెరిచిన ధరలు అందుబాటులో లేకపోవడంతో భవన పనులు ఆపారు. గోదావరి నుండి లారీల్లో బ్లాక్ తీసుకొస్తున్నా రేటు వింటే షాక్ అవుతారు. మొన్నటి వరకు టెన్జైర్ల లారీ రూ.15 వేలు ఉండేది. ఇప్పుడు లారీ రూ.30 వేల నుంచి రూ. 40 వేలకు చేరింది. అదేమంటే గోదావరి వద్ద బ్లాక్లో తీసుకోస్తున్నట్లు లారీ డ్రైవర్లు చె బుతున్నారు. కృష్ణానదిలో ఇసుక రీచ్లు తెరిస్తే చాలా తక్కువ ధరకు ఇసుక వస్తుంది. భవన నిర్మాణాలు వేగంగా సాగుతాయి. ట్రాక్టర్ రూ.3 వేలకు వచ్చేంది. ఇప్పుడు రూ.7 వేలకు చేరింది. భవన యజమానులు పనులు ఆపేసి ఇసుక అందుబాటులోకి తర్వాత చేద్దామని అనుకుంటున్నారు. గన్నవరం పట్టణంలో 200 భవనాలు, 30 అపార్ట్మెంట్లు నిర్మాణం జరుగుతుంది. కూలీలకు చేతినిండా పనులు దొరికాయి.


ఆగిన భవనం పనులు

అయితే ఇసుక ధర అందుబాటులో లేకపోవడంతో పనులు ఆపేశారు. దీంతో కూలీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆద్వర్యంలో పోరాటం చేస్తే ఇసుక అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతున్న ఆచరణలో రావడం లేదు. ట్రాక్టర్ ఇసుక 7000 పలుకుతోంది. కూలీల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆ సంఘం నాయకులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే రంగంలోకి దిగి ఇసుక ధర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వివంత హోటల్‌కు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ బందర్‌రోడ్డులోని వివంత హోటల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ఈ విషయం తెలుసుకొని వెంటనే రంగంలోకి దిగిన కృష్ణలంక సిఐ నాగరాజు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. అయితే అది అవాస్తమని సిఐ నాగరాజు తెలిపారు. వచ్చిన మెయిల్ కూడా తమిళనాడు విషయాలకు సంబంధించి విజయ్ అనే అతని పేరుతో వచ్చిందని, దానిలో బాంబు బెదిరింపు అనేది ఏమి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి తప్పుడు మెసేజ్‌లతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అలాగే హోటల్స్ కానీ ఇతర సంస్థలు ఏదైనా కానీ పూర్తి స్థాయిలో నిర్ధారణకు వచ్చిన తరువాతనే బయటకు వెల్లడించాల్సి ఉంటుందని, లేనిపోనీ ఇటువంటి ప్రచారం వల్ల ప్రజలు పలు రకాల ఆలోచనలకు గురవుతారని సిఐ తెలిపారు.

అనధికార లే అవుట్లను తొలగిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార వెంచర్లు, లేఅవుట్స్ ఉండడానికి వీలులేదని, అటువంటి వాటిపై స్పెషల్ డ్రైవ్‌చేపట్టి తొలగిస్తామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఆదివారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ఆర్‌టిఒ ఆఫీస్ రోడ్డు, సీతయ్య డొంక రోడ్లలోని అనధికారలే అవుట్స్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్ళు, బోర్డులు, రోడ్లను 3 జేసిబిలతో పూర్తి స్థాయిలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలో దరఖాస్తు చేసిన లేఅవుట్స్‌కి నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. అనధికార వెంచర్లలో ప్లాట్‌లు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో జిఎంసి నుండి అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుకావడం లేదని, ఫలితంగా మౌలిక వసతులు లేక ప్లాట్‌ల కొనుగోలుదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజల నుండి ల్యాండ్ టైటిల్ వివాదాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. నగర పాలక సంస్థ నుండి లే అవుట్స్ అనుమతి పొందిన ఫ్లాట్ విక్రయదారులు లే అవుట్స్ అనుమతి వివరాలతో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లాట్ కొనుగోలుదారులు ముందుగానే సదరు లే అవుట్స్‌కు నగర పాలక సంస్థ అనుమతులు ఉన్నది లేనిదీ పూర్తి వివరాలు తెలుసుకొని కొనుగోలు చేయాలన్నారు. అనధికార లేఅవుట్‌ల రిజిస్ట్రేషన్ నిలుపుదలపై డిస్ట్రిక్ట్ రిజిస్టార్‌కు లేఖ పంపుతామన్నారు. నగర పరిధిలో గుర్తించిన 40 అనధికార లేఅవుట్స్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, ఆదివారం నుండి స్పెషల్ డ్రైవ్ మోడ్‌లో తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సదరు లేఅవుట్స్‌లో చేపట్టిన రోడ్లు, హద్దు రాళ్లను తొలగిస్తామని, కనుక ఆయా లే అవుట్స్ యజమానులు తప్పనిసరిగా జిఎంసి నుండి తగిన అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు.



హద్దు రాళ్లు తొలగిస్తున్న జెసిబి



గోశాలను సందర్శించిన కమిషనర్

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన వడ్లమూడి కోటయ్య చౌదరి ఛారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో కళ్యాణ మండపంలో ఆదివారం ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధన రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఐటి చెన్నై మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ రమేష్ బాబు, విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ట్రస్ట్ ఆశయాలను అభినందించారు. విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని, సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలన్నారు. డాక్టర్ గుమ్మ సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ట్రస్ట్ తరపున సహాయం అందించటం అభినందనీయమన్నారు. ట్రస్ట్ చైర్మన్ వడ్లమూడి గోవర్ధనరావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా ప్రతిభగల విద్యార్థులను ట్రస్ట్ తరపున ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ న్యాయవాది వడ్లమూడి కోటయ్య చౌదరి ట్రస్టును నెల కొల్పినట్లు చెప్పారు. ఈ ఏడాది 111 ప్రతిభగల పేద విద్యార్థులకు రూ.19 లక్షలు ఉపకార వేతనాలుగా అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వి బసవ ప్రసాద్, బసవారావు, విద్యార్థులు పాల్గొన్నారు



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో ట్రస్ట్ బృందం

గోశాలలో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ గోశాలలో ఆవులకు మౌలిక వసతుల కల్పనకు అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం వెంగళాయపాలెంలోని జిఎంసి గోశాలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రోడ్ల మీద ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించే ఆవులు, ఎద్దులు, పశువులను గోశాలకు తరలిస్తున్నామన్నారు. గోశాలలో ఆవులను శుభ్రం చేయడానికి, నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ప్లాట్‌ఫారం, అదనపు షెడ్‌ని ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే మేతకి వినియోగించే గడ్డి తడవకుండా షెడ్ వేయాలన్నారు. ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది వివరాలను తమకు అందించాలని, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవులను సదరు యజమానులు కావాలని అడిగినప్పుడు, వారికి అప్పగించడానికి నిర్దేశిత ఫైన్, డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలన్నారు.పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ కళ్యాణ రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఆనందకుమార్, టిపిఎస్ లక్ష్మణ స్వామి, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం

తెనాలిలో గీతాఆర్ట్ క్రియేషన్స్

నూతన యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డులో పట్టణానికి చెందిన గీత ఆర్ట్స్ క్రియేషన్స్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడి నియాన్ బోర్డ్స్, ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్‌ను కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించారు. సంస్థ నిర్వహకులు కె సుబ్బారావు, కె నారాయణ సారథ్యంలో ఏర్పాటుచేసిన యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ వివిధ రకాల వ్యాపారాలకు తెనాలి పట్టణం చిరునామాగా ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ వ్యాపారాభివద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కాకతీయ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు మాట్లాడుతూ వ్యాపారంలో ప్రజల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. నిర్వాహకులు కె సుబ్బారావు మాట్లాడుతూ నేమ్ బోర్డులు, ఎల్‌ఈడి తో కూడిన నేమ్ బోర్డులు, ఫ్లెక్సీ ప్రింటింగ్ తక్కువ ధరలతో అందించేందుకు ఈ వ్యాపారాన్ని ప్రారంభించామన్నారు. 1997 సంవత్సరంలో గీత ఆర్ట్స్ క్రియేషన్స్ ప్రారంభించడం జరిగిందని, అప్పటినుంచి ప్రజలతో మమేకమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కుమార్ గ్రూప్ సంస్థల ప్రతినిధి కొత్త కృష్ణ కుమార్, సూర్య శిల్ప శాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు, కళాకారులు వజ్రాల నాగరాజు, లింగారావ్, సాయి బాబు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

డాక్టర్ వి.వెంకటనాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

మానవుని శరీరంలో అతి ముఖ్యమైన అవయవాలైన మూత్రపిండాలు అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వి.వెంకటనాయుడు అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ శరీరంలో మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేసి వివిధ అవయవాలకు పంపిస్తాయని, మూత్రపిండాలు దెబ్బతింటే రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియ దెబ్బతిని, తర్వాత మిగిలిన అవయవాలు కూడా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మనం తీసుకునే నీరు, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడతాయని, ఈ రాళ్ల పరిమాణం చిన్నవి అయితే సాధారణంగా మూత్ర విసర్జనలో పడిపోతాయని, ఒక్కొక్కసారి రాళ్ల పరిమాణం చిన్నవి అయినా అవి ఏర్పడిన ప్రదేశాన్ని బట్టి మూత్ర విసర్జనలో బయటకు పోయే అవకాశం లేక శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందన్నారు. మూత్రం తెల్లగా కాకుండా పసుపు రంగులో ఉంటే మనం తీసుకునే నీరు సరిపోవట్లేదని, అలాంటి సందర్భాల్లో నీరు కొంచెం ఎక్కువ తీసుకోవాలన్నారు. సాధారణంగా ఒక వ్యక్తి విడతల వారీగా రోజుకు నాలుగు నుండి ఐదు లీటర్ల నీటిని తాగాలన్నారు. మూత్రపిండ మార్పిడి గురించి తెలియజేస్తూ సాధారణంగా ఒక వ్యక్తికి రెండు మూత్రపిండాలు ఉంటాయని వాటిలో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో పనిచేసినా మనిషి జీవక్రియకు ఇబ్బంది కలగదని అందువలనే ఆరోగ్యవంతుని మూత్రపిండం ఒకటి వస్త్ర చికిత్స ద్వారా తీసి, వేరొక అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి అమరుస్తున్నారన్నారు. అనంతరం సభ్యుల సందేహాలను డాక్టర్ నివృత్తి చేశారు. కార్యక్రమానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా డాక్టర్ రమ్య , డాక్టర్ ఏ.రవీంద్రకుమార్, సీనియర్ యోగాచార్యులు ఇందుశేఖర్ పాల్గొని ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటనాయుడు

కొనసాగుతున్న 108 ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

సమస్యలు పరిష్కరించాలని ఎపి 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రులు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాల్ని రెండో రోజు కొనసాగించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, బాబు మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో 108 ఉద్యోగులు గత 18 ఏళ్ల నుండి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామన్నారు. పెరిగిన ధరలతో కుటుంబాల పోషణ కూడా కష్టమవుతుందన్నారు. పండగ పూట కూడా జీతాలు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చెప్పిన విధంగా ఇప్పుడున్న పథకాన్ని హెల్త్ ఇన్సూరెన్స్ పథకంలోకి తీసుకెళ్తే తాము నష్టపోతామని తమ సర్వే ఆధారంగా కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్యాడర్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కలగజేసుకొని రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుహాసిని, ఆనంద కుమారి, మల్లికార్జున, హసన్‌కమల్, అనిల్ కుమార్, గురుమూర్తి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కార్తీక మాసం సందర్భంగా పంచారామాలకు తెనాలి ఆర్టీసీ డిపో నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ ఆదివారం ప్రకటన విడుదల చేసారు. ప్రతి శని, ఆదివారాల్లో సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి పుణ్యక్షేత్రాలను దర్శించుకుని అదే రోజు తెనాలి చేరుకునేలా ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. సూపర్ లగ్జరీ టికెట్ ధర రూ. 1270, లగ్జరీ సర్వీస్ టికెట్ ధర రూ. 1200 ప్రకటించామన్నారు. ప్రయాణికుల కోరిక మేరకు తెనాలి డిపో నుండి శైవ క్షేత్రములు దర్శిని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ త్రి శైవ దర్శనాల్లో భాగంగా యాగంటి, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చున్నారు. ప్రయాణికులు ఈ సదవకాసాన్ని సద్వినియోగపరచుకోవలాని విజ్ఞప్తి చేసారు. తక్కువ అద్దె ప్రాతిపదికన శబరిమలై, అరుణాచలం యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 7382892492 నంబరును సంప్రదించవచ్చున్నారు.

జెట్టిపాలెంలో చోరీ

రూ.62 వేలు నగదు, బంగారం అపహరణ

ప్రజాశక్తి- రెంటచింతల

రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఒ వ్యాపారి గృహంలో చోరీ జరిగింది. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండా మల్లికార్జున తన భార్య లక్ష్మీ సౌజన్య కాన్పు నిమిత్తం ఈనెల 22న గుంటూరుకు వెళ్లారు. శనివారం ఇంటికొచ్చి చూసేసరికి బీరువా తాళాలు పగలగొట్టి అందులోనే కే,62,000 నగదుతో పాటు బంగారు గొలుసు, ఉంగరాలు, వెండి చెంబు, వెండి గిన్నెలు అపహరణకు గురయ్యాయని ఆయన తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



సంక్రాంతి నాటికి గ్రామాలకు కొత్త కళ

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నాదెండ్ల

సంక్రాంతి నాటికి గ్రామాలన్నీ కొత్తకళ సంతరించుకుంటాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని అప్పాపురంలో పలు అభివృద్ధి పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు. రూ.15 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నిధులు పరంగా అవాంతరాలు ఉండవని, నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.



సిపిఎం వినుకొండ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - వినుకొండ

సిపిఎం వినుకొండ పట్టణ నూతన కమిటీని సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బి.వెంకటేశ్వర్లు, సభ్యులుగా శివరామకృష్ణ, ఎస్‌ఎ రంజాన్‌బి, ఎం.తిరుమల లక్ష్మి పి.వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ, ఎస్‌కె కరిముల్లా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఏపూరి గోపాలరావు, నాయకులు కె.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

రేపటి సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు వైద్య మిత్ర రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు మంగళవారం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ముందు సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హనుమంతరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్ కోరారు. సమ్మెకు మద్దతుగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల నుండి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పైగా ఉద్యోగులకు నష్టం కలిగే నిర్ణయాలు చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న సమ్మెలో వైద్యమిత్రలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వైద్య మిత్రాలు సాయిబాబా, రాజు, ఎం.బుజ్జి, కె.అప్పారావు, నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

జ్వరాలు విజృంభిస్తుంటే ఏం చేస్తున్నారు : కాంగ్రెస్

ప్రజాశక్తి-చిలకలూరిపేట : పట్టణంలో ప్రతిఇంట్లోనూ ఒకరిద్దరు జ్వరాల బారిన పడుతుంటే, ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతుంటే పురపాలక సంఘం, ప్రజారోగ్య శాఖల అధికారులు ఏమీ చర్యలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ ప్రశ్నించారు. కాల్వల పూడికతీత పేరుతో ఆక్రమణలను పాక్షికంగానే తొలగించారని, తాగునీటి సరఫరా సరిగా లేదని, దీంతో కూలి పనులకు వెళ్లే వారు నీటిని పట్టుకోలేకపోతున్నారని చెప్పారు. నీరు కాచుకుని తాగేవీలు పేదలందరికీ ఉండకపోవచ్చుని, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని కోరారు. ఆక్రమణల తొలగింపుతో జీవనోపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారం చెల్లించడంతోపాటు ప్రత్యామ్నాయం చూపాలన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఇంటింటికీ వెళ్లి ఎండగడతాం

సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జమిలి ఎన్నికల పేరుతో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని, ఇందుకు తాము పూర్తి వ్యతిరేకమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. నరసరావుపేటలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిత్యావసర సరుకులు కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య మధ్యతరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందని అన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులో సమస్యలను పరిష్కరించి అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పకే ఇసుక దొరక్క భవన నిర్మాణ, అనుబంధ రంగాలు, వాటిపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోవైపు ప్రజలపై భారాలు మోపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎసీ, ఎస్టీ, మైనార్టీలు, వెనకబడిన వర్గాల మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగాయని, వీటిని అరికట్టడంతో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మండిపడ్డారు. గిరిజనులకు రిజర్వేషన్లు, ఉపాధిని దెబ్బతీసే జీవో 3ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పెరిగిన ధరల్యకు వ్యతిరేకంగా, ఇతర ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 8 నుండి 15 తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించస్తామని చెప్పారు. ప్రభుత్వాల విధానాలను సిపిఎం శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఎండగడతారని అన్నారు. డిసెంబర్ 1న పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో సిపిఎం జిల్లా మహాసభ నిర్వహిస్తామని, అన్ని, విజయవంతానికి అన్ని రంగాల ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

సరస్వతి సిమెంట్ భూముల వ్యవహారాన్ని నిగ్గు తేలుస్తాం

నష్టపోయిన ప్రతిరైతుకూ న్యాయం చేయడమే ధ్యేయం : ఎమ్మెల్యే యరపతినేని

ప్రజాశక్తి- రెంటచింతల

ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి నిరుపేద రైతుల నుంచి కారు చౌకగా భూములను కొట్టేసిన సరస్వతి సిమెంట్ భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం నిగ్గు తేల్చుతుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఆదివారం తన స్వగ్రామమైన రెంటచింతల మండలంలోని మంచికల్లుకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒకవైపు రైతులను బెదిరించి, మరోవైపు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతామని మభ్యపెట్టి కార్పొరేట్ సంస్థల నుంచి రూ.వందల కోట్లు తీసుకున్నారని ఆరోపించారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు ఫ్యాక్టరీ నిర్మాణం చేపడతామని, ఇకనుంచి పల్నాడులో నిరుద్యోగం ఉండదని బుకాయించారని, ఇప్పటికీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. భూమి ఇచ్చిన రైతులపై అక్రమ కేసులు బనాయించి హింసించారని విమర్శించారు. ఆయనవెంట నాయకులు శివప్రసాద్, బి.నరసింహారావు, పి.సతీష్, ఎన్.శేషగిరిరావు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - దాచేపల్లి

స్థానిక అంజనాపురం కాలనీలో డయేరియా ప్రబలి నాలుగు రోజుల క్రిత మరణించిన వారి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (20), బండారు చిన్న వీరయ్య (60) కుటుబీకులకు రూ.25 వేల చొప్పున మహేష్‌రెడ్డి సమకూర్చగా వైసిపి నాయకులు వాటిని అందజేశారు. అనంతరం కాలనీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి పరిస్థితిపై వైద్య సిబ్బందితో మాట్లాడారు. కె.సుబ్బమ్మ సాంబయ్య, విజయ్ కుమార్, ఖాదర్‌బాషా, ఎంపిపి కె.జాన్, రఘు, బి.బాలయ్య, వి.తిరుపతయ్య, జి.పుల్లారావు, లింగయ్య పాల్గొన్నారు.

ఒక్క కేసూ నమోదు కాలేదు : డాక్టర్ అమూల్య

అంజనాపురంలో వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నామని, ఆదివారం ఒక్క డయేరియా కేసుకూడా నమోదు కాలేదని దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమూల్య తెలిపారు. డయేరియా బారిప పడ్డవారు కోలుకుంటున్నారని, కొంతమంది డిశ్చార్జి అయ్యారని చెప్పారు. నరసరావుపేటలో ఉన్న ఐదు ఐదుగురు పూర్తిస్థాయిలో కోలుకుంటున్నారని, సోమవారం వారినీ డిశ్చార్జి చేస్తారని తెలిపారని చెప్పారు. స్థానిక పిహెచ్‌సిలో ప్రస్తుతం ఒక్కరు కూడా డయేరియా బాధితులు లేరన్నారు. ప్రస్తుతం పరిస్థితులన్నీ అదుపులో ఉన్నాయని చెప్పారు.

ఆపదలో వచ్చేవారికి అంకితభావంతో వైద్యం చేయండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైద్య వృత్తి పవిత్రమైందని, వైద్యం కోసం వచ్చే ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని ఐఎంఎ హాలులో ఆదివారం జరిగిన సిఎంఇ-2024 కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతి నిజాయితీలకు నిదర్శనంగా వైద్యులు నిలవాలన్నారు. శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, డాక్టర్ హిమజ, డాక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ వైద్య సేవల కోసం వచ్చే వారికి సకాలంలో స్పందించి అండగా ఉండాలన్నారు. పేదలకు రాయితీపై వైద్య సేవలు అందించాలని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. గుండె, ఊపిరితిత్తులలో రక్తపు గడ్డల నివారణపై అందించాల్సిన వైద్య గురించి చర్చించారు. సీనియర్ వైద్యులు కొండపల్లి వెంకటేశ్వర్లు, గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జన్మను ప్రసాదించేది అమ్మ అయితే ఆపత్కాల సమయంలో పునర్జన్మనిచ్చేది వైద్యులన్నారు. ప్రాణాపాయంలో ఉన్నవారి బాధను, కుటుంబ సభ్యుల ఆవేదనను తమ భుజస్కందాలపై మోస్తూ రక్షణే ధ్యేయంగా సాహసంతో వైద్యులు చేసే కృషి మాటల్లో చెప్పలేనిదన్నారు. చికిత్స విజయవంతమైతే వైద్యులకు ఆనందం మాటల్లో వర్ణించలేదన్నారు. అనంతరం వైద్య రంగం సమకాలీన పరిస్థితులలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ సూరా ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ ఎం.రమేష్‌బాబు, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ ఎల్.ఎన్ రావు, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శాఖమూరి బాజిబాబు, డాక్టర్ అన్నా మణికంఠ సురేష్, డాక్టర్ యలవర్తి వరబాబు, డాక్టర్ ఓగూరి కోటయ్య, డాక్టర్ అశోక్, డాక్టర్ క్రాంతికుమార్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

'సరస్వతి' భూములపై కొనసాగుతున్న అటవీశాఖ సర్వే

ప్రజాశక్తి - దాచేపల్లి

మాచవరం మండలం పరిధిలోని సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూములను ఆదివారం ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. మాచవరం మండలంలోని రేవులగడ్డ సమీప ప్రాంతంలో వివిధ గ్రామాల్లోని సరస్వతికి చెందిన భూములకు అనుకొని ఉన్న అటవీశాఖ భూముల హద్దులను జిపిఎస్ ద్వారా పరిశీలిస్తున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు. సర్వేలో దాచేపల్లి సెక్షన్ డిఆర్‌ఒ విజయలక్ష్మి, ఎస్‌బిఒ వెంకటేశ్వర్‌రావు, మనోజ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.



లాంచి స్టేషన్ ఆదాయం రూ.30 వేలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో లాంచి స్టేషన్‌కు ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది, వివిధ ప్రాంతాల నుండి పర్యాటకుల లాంచి స్టేషన్ వద్దకు చేరుకొని పార్కులలో పిల్లలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం అనుపులోని నాగార్జున యూనివర్సిటీ నమూనా, హంపి థియేటర్‌ను తిలకించారు. లాంచి స్టేషన్ ఆదాయం కూడా రూ.30 వేలు చేకూరినట్లు అధికారులు తెలిపారు.

ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను నియమించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం పెదకూరపాడు శాఖ మహాసభ కె.నరసింహారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు, నాయకులు జి.మల్లేశ్వరి మాట్లాడుతూ పెదకూరపాడులో రోడ్ల విస్తరణ చేపట్టాలన్నారు. ఎస్సీ కాలనీలో సైడ్ డ్రెయిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. కౌలు రైతులకు రుణాలివ్వాలని కోరారు. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించ్చఇంది. శాఖ నూతన కార్యదర్శిగా డి.శేషారావును ఎన్నుకున్నారు. ఎ.దావీదు, ఎస్.వెంకట్రావు, ఎన్.చిన్న పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన ఇళ్లపట్టాల హామీని అమలు చేయాలి

ఇసుకను అందుబాటులోకి తెచ్చి నిర్మాణరంగ కార్మికులకు పనులు కల్పించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు





మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మహాసభలు తీర్మానించాయి. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇక్కడ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని మహాసభలు కోరాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమీ ప్రభుత్వం ఇసుకను అందుబాటులోకి తేవాలని సుందరయ్య నగర్ రెండు శాఖల మహాసభలు తీర్మానించాయి. ఆదివారం రాత్రి సుందరయ్య నగర్‌లో నిర్వహించిన శాఖా మహాసభలకు నాయకులు సిహెచ్ భుజంగరావు, సుధ అధ్యక్షతన జరిగాయి. ముందుగా సిపిఎం పతాకాన్ని సీనియర్ నాయకులు భుజంగరావు ఆవిష్కరించారు. కృష్ణానది ఒడ్డునున్న కృష్ణవేణి నగర్‌లో వరదల శాశ్వత నివారణకు విజయవాడ వైపు నిర్మాణం చేసినట్లు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని మహాసభలు తీర్మానించాయి. తాడేపల్లి ప్రాంతంలో అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తామని, ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పిస్తామని లోకేష్ బాబు చేసిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. దేశంలో మత తత్వవిధానాలతో పాలన సాగిస్తున్న బిజెపి దూకుడు కు కళ్లెం వేయాలని కోరారు. ఎన్నికలకు ముందు నాలుగు వందల సీట్లు పైగా తమకు వస్తాయని గప్పాలకపోయినా బిజెపి 240సీట్లు దగ్గరే సతికల బడిందని ఎద్దేవ చేశారు. లోక్‌సభ సాంప్రదాయాలను తుంగలోతొక్కి ప్రతిపక్షాలకు ఇవ్వవలసిన డిప్యూటీ స్పీకర్ పదవిని కూడా బిజెపి కొట్టేసిందని ఎద్దేవ చేశారు. ప్రజా ఉద్యమాలను అణచటానికి క్రిమినల్ చట్టాలు తీసుకొచ్చారని విమర్శించారు. అభ్యుదయ వాదులను, వామపక్షవాదులను, హక్కుల కార్యకర్తలను అణచడానికి ఈ చట్టాలనుదుర్వినియోగ పరుస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సిబిఐ, ఈడి తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి 47 వేల మందిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. వాటిలో 2000 మందిపై కూడా ఆధారాలు చూపలేకపోయారని చెప్పారు. ఢిల్లీ, జార్కాండ్ ముఖ్యమంత్రులను అనవసరంగా కేసుల్లో ఇరికించి జైలుకు పంపించారని మండిపడ్డారు. దేశ రక్షణ కోసం పనిచేసే సైన్యంలో కూడా ప్రైవేటీకరణ విధానాలను ప్రవేశపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయని అసంతప్తి వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకులు ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగిపోయాయని చెప్పారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో కరెంటు బాదుడు మొదలైందని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పక్కదారి పట్టించడానికి పవన్ కళ్యాణ్ తిరుపతి లడ్డు చుట్టూ రాజకీయం చేశారని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో ప్రతి చోటా కల్తీ రాజ్యమేలుతుందని చెప్పారు. చిత్తశుద్ధి ఉంటే కోటం ప్రభుత్వం ఈ కల్తీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో మాదిరి ఈ ప్రభుత్వంలో కూడా ఇసుక అక్రమ రవాణా నేటికీ కొనసాగుతుందని తెలిపారు. ఈ సభలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వరరావు, దొంతి రెడ్డి శ్రీనివాస కుమారి, గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాసభ సుందరయ్య నగర్ మహిళా శాఖకు ఎస్ గిరిజ, రెండవ శాఖకు కొట్టే కరుణాకర్‌లను ఎన్నుకున్నారు.

ఎయిమ్స్‌లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు రమేష్ అన్నారు. మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఎయిమ్స్ యూనియన్ విస్తృత సమావేశం యూనియన్ నాయకులు కె వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. రమేష్ తన ప్రసంగానికి కొనసాగిస్తూ ఎయిమ్స్‌లో 127 పర్మినెంట్ పోస్టుల్లో గతం నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. మొదటినుండి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని క్వాలిఫికేషన్ పరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి గ్రేస్ మార్కులను జోడించి పర్మినెంట్ చేయాలని ఎయిమ్స్ అధికారులను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎయిమ్స్ 2019 సంవత్సరంలో నిర్మాణ దశ నుండి పనిచేసిన సెక్యూరిటీ గార్డులను 72 మందిని తొలగించడం జరిగిందని, తొలగించిన కార్మికులను సిఐటియు అండగా ఉండి పోరాటం చేసిన ఫలితంగా 2023లో 54 మందిని తిరిగి పనిలోకి తీసుకున్నారని, మిగిలిన వారిని ఇంకా తీసుకోలేదని వారిని వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ కార్మికులకు ప్రతినెల 5వ తేదీ లోపు జీతాల వేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కాంట్రాక్టర్ కార్మికులను ఎంఎన్‌ఓలుగా పనిచేయిస్తూ హౌస్ కీపింగ్ జీతం ఇస్తున్నారని అన్నారు. అటు అధికారులను, కార్మికులను కాంట్రాక్టర్ మోసం చేస్తున్నారని విమర్శించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి సిఐటియు చేస్తున్న పోరాటానికి కార్మికులు సంఘటితంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి ఎం బాలాజీ, సహాయ కార్యదర్శి కె బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షులు రమేష్



సికె కళాశాల సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని సికె హైస్కూల్ 1982, సికె జూనియర్ కళాశాల 1984 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మిడ్వాల్సిటీ క్లబ్ హౌస్‌లో జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాల్గొని విద్యార్థి దశలో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కుటుంబ సమేతంగా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి రావెల శ్రీనివాసరావు, టి తిరుమలరావు, కామరాజు, జి సీతారాం ప్రసాద్, దామర్ల కుబేర స్వామి నాయకత్వం వహించారు.



సావనీర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-గుంటూరు

తరతరాలుగా సామాజిక వివక్షత ఎదుర్కొన్న సూర్య బలిజలు స్వాతంత్ర అనంతరం విద్యను ఆయుధంగా మలుచుకొని ఎదుగుతున్నారని, వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక, అభ్యున్నతి విద్యతోనే సాధ్యమని రాష్ట్ర సూర్యబలిజ సంఘం నాయకులు చదలవాడ రఘురాం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో జిల్లా సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్య ఉపకరణాలు అందించే కార్యక్రమం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన సంఘం కార్యదర్శి మద్దెల కైలాష్‌నాథ్ బాబు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా విద్యాసంఘం ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు, విద్య ఉపకరణాలు అందించడంతోపాటు పోటీ పరీక్షలకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తూ విద్యార్థులు ఎదుగుదలకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ చదల వాడ రవి, చదలవాడ వేణు, సిహెచ్ సుధాకర్, సిద్ధ బత్తిని విజయ్‌కుమార్, సిహెచ్ శ్రీనివాసరావు, పువ్వుల మహేష్, దాసరి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ కంపెనీ భూములను రైతులకివ్వండి : మాజీ మంత్రి డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

సరస్వతి పవర్ కంపెనీ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అరండల్ పేటలోని తన కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు దాచేపల్లి మండలంలోని పరిశ్రమ పేరిట రైతులు, ప్రజల నుంచి వందలాది ఎకరాలను తీసుకుని 15 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు పరిశ్రమ స్థాపించడంలేదని ఆరోపించారు. ఒక సొసైటీ ఏర్పాటు చేసి ఈ భూములను రైతులకు కౌలుకు ఇచ్చేలా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. కొత్త పరిశ్రమలు వస్తే పల్నాడు ప్రాంతంలో ఉపాధి దొరుకు తుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురయిందన్నారు. రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న ఇతర కంపెనీల భూములను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. జగన్ వ్యవహారం చూస్తుంటే భారతీయ నైతిక విలవలు ఎలా దిగజరిపోతున్నాయో అర్ధమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో నాయకులు ప్రజలకు ఆదర్శంగా నిలబడాలే తప్ప విలన్ జీవితాలను ప్రజలకు పరిచయం చేయకూడని హితవు పలికారు. భారతీయ న్యాయ సూత్రం పై మాజీ ముఖ్యమంత్రి చేస్తున్న దాడి ప్రజలకు తప్పుడు సంకేతాలను అందిస్తోందని విమర్శించారు. తాడేపల్లి ప్యాలస్ లోని మందీ మార్బలం మొత్తం ఒకచోట చేరి ఆపరేషన్ పి పేరుతో అనేక దురాగతాలకు పాల్పడటం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ఆపరేషన్ పి2 తాడేపల్లి ప్యాలస్ కమాండర్ అనుమతితోనే జరుగుతున్న సంగతి విజయమ్మ, షర్మిలలు గుర్తించాలని కోరారు. కమాండర్ అనుమతితో పి1 ఆపరేషన్ తో వివేకానంద రెడ్డిని హత్య చేసిన సంగతి గుర్తు చేశారు. ఆపరేషన్ పి2 ఒక కోడ్ గా అనుకుంటున్నానని తెలిపారు. పులివెందుల ఆపరేషన్2 అని వాళ్ళ భాషలో అర్ధం చేసుకోవచ్చని వివరించారు.

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గుంటూరు జిల్లా నాయకులు తెలిపారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో సత్యరాజు మాట్లాడారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 104 సేవలను పిహెచ్‌సిల ద్వారా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. నెలనెల జీతాలు కూడా సకాలంలో రావట్లేదన్నారు. ఉద్యోగ భద్రత లేక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వ తక్షణమే కలుగజేసుకొని ఆప్కాస్ గానీ, కాంట్రాక్ట్‌లో చేర్చి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగ నియామకాల సందర్భంగా అగ్రిమెంట్‌లో ఉన్న విధంగా ఇంక్రిమెంట్స్ ఇవ్వాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 104 ఉద్యోగులు గ్రామాలలో ప్రభుత్వం ప్రచారం చేసుకున్న విధంగా ఫ్యామిలీ డాక్టర్ అని, అనేక రకాలైనటువంటి వైద్య సౌకర్యాలకు కీలకంగా ఉన్నటువంటి 104 ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం యూనియన్ నాయకత్వంతో తక్షణమే చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రానున్నటువంటి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు ఏడుకొండలు, సురేష్ బాబు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, ఆనంద్, వినయ్ బాబు, శ్రీహర్ష, సాయిరాం, నాగులు, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సత్యరాజు



260 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీపీ, షుగర్ వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. 260 మందికి జూనియర్ డాక్టర్ గుంటుపల్లి దివ్యతేజ, సొంటినేని నవ్యశ్రీ పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు అందించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు వాలంటీర్, అభివృద్ధి కమిటీ సభ్యులైన చెన్నుపాటి పూర్ణచంద్రరావుకు శ్రద్ధాంజలి ఘటించారు. వాలంటీర్లకు సీనియర్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజనాలు ఏర్పాటు చేశారు. యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు కె.రామబ్రహ్మం, ఎం.వేణుగోపాల్, పి.శ్రీనివాసరావు, బి.రాజేష్ కుమార్, ఎం.ధర్మతేజ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుమన్, కె.రామోజీరావు, సిహెచ్ రంగారావు, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దీపావళి బాణసంచా విక్రేతలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట డిఆర్ఎఫ్ఓ శ్రీధర్, చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. చిలకలూరిపేట పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని దుకాణాలనూ తనిఖీ చేస్తామని, అనుతులు లేకుండా నిల్వ చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు పొందిన వారే విక్రయించాలని, షాపునకు షాపునకు మధ్య దూరం 15 మీటర్లు ఉండాలని, ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌కు కనీసం 50 మీటర్ల దూరంలో షాపులు పెట్టుకోవాలని సూచించారు. ప్రతిదుకాణం వద్ద 200 లీటర్ల నీరు, పొడి ఇసుక అందుబాటులో పెట్టుకోవాలని, జాయింట్లు లేకుండా విద్యుత్ వైర్లు ఉండాలని సూచించారు. షాపుల్లో 18 ఏళ్లలోపువారిని పెట్టుకోవద్దని ఆదేశించారు.



సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక సాగరమాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సందేశమిచ్చారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం జరిగింది. పలువురు మొక్కులు చెల్లించుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలు

ప్రజాశక్తి - దుర్గి



స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటోలను జనసేన పట్టణ అధ్యక్షులు పల్నాడు జిల్లా రాయల్ కాప్స్ ప్రధాన కార్యదర్శి రుద్రాల రవి అందజేశారు. వీటిని ఎస్ఐ సుధీర్‌కు ఆదివారం ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.రామకృష్ణ, కె.ఉదయ్, ఎస్.సుబ్రమణ్యం, సుధీర్, సైదారావు, పాల్గొన్నారు.

గ్రామాల్లో భైరవాల భయం

బయటకు రావాలంటేనే జంకుతున్న జనం - ఊళ్లకు ప్రయాణమై ఆస్పత్రులకు



దుర్గిలోని ముటుకూరు రోడ్డులో కుక్కల గుంపు

ప్రజాశక్తి - దుర్గి

మండలంలో పలు గ్రామాల్లో కుక్కల సంఖ్య నానాటికీ పెరుగుతూ ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. ప్రతివీధికీ 10 చొప్పున గుంపులుగా తిరుగుతూ అటుగా వచ్చిపోయేవారిపై దాడులకు దిగుతున్నాయి. అడిగొప్పల, దుర్గి, ముటుకూరు గ్రామాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇటీవల పలువురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. స్వల్ప గాయాలతో కుక్కల బారి నుండి తప్పించుకున్న వారు దుర్గి, ముట్టుకూరు ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం చేయించుకుంటుండగా, ఎక్కువగా గాయపడ్డవారు మాచర్ల, గుంటూరులోని ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు ఇళ్లల్లో నుండి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. దుర్గిలో రెండ్రోజుల కిందట చిన్నారిపై కుక్క దాడి చేసింది. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నా వెంబడిస్తున్నాయి. దీంతోపాటు ఇళ్లేదుట పార్కు చేసుకున్న బండ్ల సీట్లను కుక్కలు చింపి చిందరవందర చేస్తున్నాయని, కొత్తవాటిని వేయించుకోవడానికి వందలకు వందలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాహనదార్లు వాపోతున్నారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో సుమారు 10-15కు పైగా వాహనదారులు సీటు కవర్లను కొత్తవి వేయించుకోవడంతోపాటు వాటికి రక్షణ కోసం ప్రత్యేకంగా ఇతర పట్టాలను కుట్టించుకుంటున్నారు. మండల కేంద్రమైన దుర్గిలో అర్ధరాత్రి వేళ హైదరాబాదు, బెంగళూరు వెళ్లేందుకు ప్రయాణికులు లగేజీ బ్యాగులతో బస్టాండ్‌కు వెళ్తుండగా వారిపైకీ కుక్కలు ఎగబడుతున్నాయి. పలువురు ఊర్లకని బయలుదేరి ఆస్పత్రి పాలైన సందర్భాలూ కోకొల్లలు. ముటుకూరు అడ్డరోడ్డు వద్ద గుంపులుగా చేరి ఆ ప్రాంతంలో వాహనదారులను, పాదచారులను గాయపరుస్తున్నాయి.



దుర్గిలోని హైస్కూల్ సమీపంలో కుక్కల గుంపు

పదేళ్ల క్రితం ఇలాంటి పరిస్థితే తలెత్తగా పంచాయతీలు ఆధ్వర్యంలో కుక్కలను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించారు. మళ్లీ ఈ సమస్యలపై ప్రజలు పదేపదే విన్నవించినా, మండల పరిషత్ కార్యాలయంలో అర్జీలిచ్చినా స్పందన కరువైందని పలువురు వాపోతున్నారు. కుక్కకాటుకు గురైన వారు ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే కొన్ని సందర్భాల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేక మాచర్లకు వెళ్లాలని చెబుతున్నారనే విమర్శలూ వస్తున్నాయి.

విద్యకు ప్రాధాన్యమివ్వండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాట్లాడుతున్న సోం ప్రకాష్ యాదవ్

అఖిల భారత యాదవ మహాసభ జోనల్ సమావేశం గుంటూరు అరండల్‌పేట 2/4 వైన్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణ్ మండపంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత యాదవ మహాసభ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోంప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలోని యాదవులు విద్యకు ప్రాధాన్యమివ్వాలని, ఐక్యతగా మెలగాలని చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు త్వరలో జరగనున్నాయని, నాలుగు జిల్లాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ కుల గణన జరగాలని అన్ని రంగాల్లోనూ యాదవులకి రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహాసభ మహిళా విభాగం అధ్యక్షులు నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవుల అభ్యున్నతికి ఐక్యమత్యంగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల వీరశేఖర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా అఖిల భారత యాదవ సంఘం కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తానని అన్నారు. సమావేశంలో బొట్ల రామారావు యాదవ్, పూర్ణచంద్రరావు యాదవ్, పీఎం కొండయ్య యాదవ్, డాక్టర్ ఉమాపతి యాదవ్, తాళ్ల వెంకటేష్ యాదవ్, అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, ఎర్రాకుల తులసి రామ్ యాదవ్, లక్ష్మీప్రసాద్ యాదవ్, కోలికొండ శంకర్ యాదవ్, ఆళ్ల సాంబశివరావు యాదవ్, శివ యాదవ్, చాముండేశ్వరి యాదవ్, చావాలి పద్మ, శివ పార్వతి, మహాలక్ష్మి, జట్టి వెంకటరమణ, నీలిమ యాదవ్ పాల్గొన్నారు.



'మూడుసార్లు ఎమ్మెల్యేలైనా ఆస్తులు సంపాదించని కుటుంబం అది'

ప్రజాశక్తి- మాచర్ల

మూడు సార్లు ఎమ్మెల్యే పదువులు చేసినా ఆస్తులు సంపాదించుకోని కుటుంబం జూలకంటిదని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. కూటమి నాయకులతో కలిసి స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మాందరెడ్డి తండ్రి నాగిరెడ్డి, తల్లి దుర్గాంబలతో కలసి పనిచేశానని, నాగిరెడ్డి రెండు సార్లు, దుర్గాంబ ఒకసారి ఎమ్మెల్యేలుగా చేసినా ఎక్కడా అవినీతికి పాల్పడలేదని అన్నారు. బ్రహ్మారెడ్డి కూడా వారి బాటలోనే నడుస్తున్నారని, అయినా ఆయనపై పత్రికల్లో అవినీతి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కె.దుర్గారావు, నాయకులు కేశవరెడ్డి, ఎం.చినవెంకట్రామిరెడ్డి, షేక్ మదార్‌సాహెబ్, ఎం.వాసు, జనసేన నాయకుడు చినలాలు, బిజెపి నాయకులు నాసరయ్య పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లో బుక్ అవదు.. అయినా ఇసుక రాదు..

- ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్న సచివాలయ సిబ్బంది
- ఆన్‌లైన్ విధానంపైనే లబ్ధిదారుల్లో అనుమానాలు
- నిర్మాణాలు కదలక.. పనులు దొరక్క కార్మికుల అవస్థలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉచిత ఇసుక విధానం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామని, అవకతవకలకు తావు లేకుండా ఉచిత ఇసుక విధానం నిర్విరామంగా కొనసాగిస్తున్నామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా వాస్తవాలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆఫ్లైన్, ఆన్లైన్ విధానాల ద్వారా ఇసుక పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని, రోజూవారీ కోటాలో 50 శాతం ఇసుక ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా, మరో 50 శాతం రీచ్‌ల వద్ద ఆఫ్‌లైన్ బుకింగ్ ద్వారా ఇవ్వాలనే నిబంధన పెట్టారు. రీచ్‌లు, స్టాక్ పాయింట్లతో పాటు అక్రమ తరలింపునకు అవకాశం ఉన్న రూట్లలో సిసి కెమెరాలు పెట్టి ఇసుక అక్రమ తరలింపు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఆయా శాఖల పరిధిలో నిర్మాణాలకు ఇసుకను రిజర్వ్ చేసి నిరాటంకంగా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని అటున్నారు. అయితే ఇవన్నీ మాటలకే పరిమితం అవుతున్నాయి.

ఉచిత ఇసుక విధానం అక్రమ వ్యాపారులకు వరంగా లబ్ధిదారులకు శాపంగా మారింది. భవన నిర్మాణదారులు ఇసుక బుకింగ్ కోసం వెళుతుంటే సైట్ రావడం లేదని రాత్రి సమయంలో మాత్రమే సైట్ పని చేస్తుందని చెబుతున్నారు. ఈ మేరకు కొంతమంది రాత్రివేళల్లో ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటున్నారు. అయితే వారికీ ఇసుక రాకపోవడంతో తమమీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ బుకింగ్‌పైనే ఆనుమానాలు వస్తున్నాయి. ఇసుక అవసరం ఉన్న భవన నిర్మాణ దారులు సచివాలయానికి వెళితే ఇసుక నమోదు చేయకుండా సచివాలయ ఉద్యోగులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.



మరోవైపు వివిధ కారణాల వల్ల ఇసుక సరఫరా కుదుట పడకపోవడంతో భవన నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. కార్మికులకు పనులూ దొరకడం లేదు. ఇప్పటికే ఆర్థికంగా తాము నానా అవస్థలు పడుతున్నామని, పండగ వేళల్లో అయినా పనులు దొక్కపోతే కుటుంబాల పోషణ, ఇతర ఖర్చులు ఎలాగని భవన నిర్మాణ రంగం, దాని అనుబంధ రంగాల కార్మికులు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని, ఇసుక సరఫరా సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

పక్షవాతంపై నేడు జాషువా విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ పక్షవాత దినోత్సవం-2024 సందర్భంగా అక్టోబర్ 28వ తేదీ సోమవారం సాయంత్రం 6గంటలకు స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్, ప్రజారోగ్య వేదిక గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో పక్షవాతంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎల్.ఎస్.భారవి, ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర నాయకులు అబ్దుల్ సలీం తెలిపారు. శనివారం బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో మారిన జీవన విధానం, ఆహార అలవాట్లు, ఒత్తిడి వల్ల ప్రతి నలుగురులో ఒకరు పక్షవాతానికి గురవుతున్నారని తెలిపారు. పక్షవాతం రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వచ్చిన తర్వాత చికిత్స, జాగ్రత్తల గురించి అవగాహన కల్పించటానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈసదస్సులో గుంటూ నగరంలోని దాదాపు 16 ప్రముఖ న్యూరాలజిస్టులు ఈ సదస్సులో పాల్గొంటారని, హాజరైన వారి సందేహాలను ముఖాముఖి మాట్లాడి నివృత్తి చేస్తారని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక నాయకులు మురళి, వై.సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, కోశాధికారి సీతారాం, ఉపాధ్యక్షులు వెంకటరత్నం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మలినేని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కోలాహలంగా జరిగినది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ కళాశాల ఇంత అభివద్ధి చెందడానికి కారణం పూర్వ విద్యార్థులు, వారి తల్లి తండ్రుల ప్రోత్సాహం అని తెలిపారు. పదిహేను సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగ ఇలా అందర్నీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అడ్మిషన్ డీన్ డాక్టర్ పోపూరి రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంజినీరింగ్ కళాశాలల మధ్య ఉన్న పోటీ పరిస్థుతులలో ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రదర్శన కనపర్చడంలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో కళాశాల చైర్మన్


ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకుంటున్నా పట్టభద్రులు

పట్టభద్రుల ఓట్ల నమోదుకు విశేష స్పందన

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని మండల కేంద్రం దుగ్గిరాల్లో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దాదాపు 200 మంది అర్హత గల ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వల్లూరు నరసింహారావు ఎద్దు ప్రసాద్ నక్క చిరంజీవి దేవరపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

సంజీవని ఆరోగ్య రథం ఉచిత సేవలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్ర విద్యాశాఖ మరియు ఐటీ మంత్రి మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ సహకారంతో నియోజక వర్గంలో ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తున్న సంజీవని ఆరోగ్య రథం సోమవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని యాదవ్ పాలెం లో సేవలు అందించనున్నట్లు టిడిపి నాయకులు గద్దె శ్రీనివాస్ తెలిపారు .గ్రామ ప్రజలు ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు మరియు ఆ పార్టీ నాయకులు గద్దె శ్రీనివాస్ తెలుగుదేశం పార్టీలో శాశ్వత సభ్యత్వం పొందారు. ఒక్కొక్కరు ఆన్లైన్ ద్వారా లక్ష రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందినట్లు ఆదివారం వారు తెలిపారు.

నేటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి దేవస్థానం ఆవరణలో శ్రీ రాధాకష్ణా యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, ప్రధాన యోగాచార్యులు పడమట రాధాకృష్ణా యోగి ఆదివారం తెలిపారు. మూడు వారాలు పాటు జరిగే శిబిరంలో యోగాసనములు, ధ్యానం లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7:30 వరకు శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుజీ విజ్ఞప్తి చేశారు.

చిర్రావూరు టిడిపి గ్రామ అధ్యక్షునిగా కాసరగడ్డ శ్రీనివాస్ నియామకం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



ఎంటిఎంసీ పరిధి లోని చిర్రావూరు గ్రామ టిడిపి నూతన అధ్యక్షులుగా కాసరగడ్డ శ్రీనివాస్‌ను, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాను సారం నియమిం చినట్లు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బా రావు ఆదివారం ఓ ప్రకట నలో తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి చిర్రావూరు నూతన గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాస్ మాట్లాడుతూ తనని గుర్తించి, టిడిపి గ్రామ అధ్యక్షులు గా నియమించిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావుకు ఆయన కృతజ్ఞత తెలిపారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

మంగళగిరి పట్టణ సిఐ వినోద్ కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి



నిబంధనల ప్రకారం లైసెన్సులు పొందిన వారు మాత్రమే దీపావళి సామాగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ వినోద్ హెచ్చరించారు. అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన లైసెన్సు లేని దుకాణాలను ఏర్పాటు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వారు మాత్రమే దీపావళి సామాగ్రి అమ్ముకునే అవకాశం ఉందని అన్నారు అనుమతులు పొందకుండా విక్రయించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ వినోద్ కుమార్ హెచ్చరించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - తెనాలి

రోగ నియంత్రణలో శారీరిక వ్యాయామం కూడా ఎంతో ముఖ్యమని ప్రముఖ వైద్యులు డాక్టర్ డి శారద చెప్పారు. రూరల్ గ్రామం బుర్రిపాలెంలో ఆదివారం డి3 సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో రోగులకు బిపి, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావం, ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారన్నారు. రోగ నిర్ధారణకు ప్రభుత్వ వైద్యశాలలో అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఖర్చులు తగ్గించు కోవాలన్నారు. అదేవిధంగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని కూడా సద్విని యోగం చేసుకోవాలని ఆమె కోరారు. షుగర్ వ్యాధి గ్రస్తులకు ఆహార నియమాలను వివరించారు. శిబిరంలో కన్వీనర్ ఎన్ శ్రీనివాసరావు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు

అడవితక్కెళ్లపాడు టిడ్కోగృహ సముదాయంలో నివశించే ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో జిఎంసి అధికారులు శ్రద్ధ తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ టిడ్కోగృహ సముదాయాలను అధికారులతో కలిసి పరిశీలించి, స్థానికులతో సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు, వీధి దీపాలు, అప్రోచ్ రోడ్, చెత్త సేకరణ తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మితపద్మజ, టిడ్కో ఈఈ ప్రసాదరావు, జిఎంసి ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ హనీఫ్, ఎం.హెచ్.ఓ. రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని భార్గవపేట సిపిఎం శాఖా మహాసభ జరిగింది. శాఖా మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించడ జరిగింది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సంబంధించిన జీవోను వెంటనే ఇవ్వాలని, అర్హులైన వారందరికీ వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగ, వితంతు పెన్షన్లు ఇవ్వాలని తీర్మానించడం జరిగింది. శాఖ కార్యదర్శిగా శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

శుద్ధపల్లి డొంక మెయిన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

శుద్దపల్లి డొంక మెయిన్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారుల్ని ఆదేశించారు. ఆదివారం ఎమ్మెల్యే నసీర్ 10వ డివిజన్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులు దష్టి సారించాలని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా శుద్ధపల్లి డొంక మెయిన్ రోడ్డు గుంటలుగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు సమస్యకు పరిష్కారానికై రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న రెండు నెలలలో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, శుద్ధపల్లి డొంక మెయిన్ రోడ్డుకు మహర్దశ తీసుకొస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, మీరావలి, చిస్టీ, పఠాన్ జమీర్, గాలి సతీష్, రియాజ్, అఖని, ఉస్మాన్, జనసేన నాయకులు శేఖర్, జడసురేష్ పాల్గొన్నారు.



రిక్షా బండిని అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకులు మధుసూదన్ వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో హల్లెలూయ ప్రార్థనా మందిరానికి అవసరాల నిమిత్తం, మూడు చక్రాల రిక్షా బండిని ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు పాస్టర్ సాంసంన్ కు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో రూ.16,000 విలువచేసే మూడు చక్రాల బండిని ప్రార్ధన మందిరానికి అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, వడ్డేశ్వరం అబ్రహం, షేక్ ఇమాంస, కంచర్ల కోటేశ్వరరావు, వడ్డేశ్వరం తంబి బాబు తదితరులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న శరత్‌చౌదరి, తదితరులు

ఘనంగా ప్రారంభమైన 'రోటో ఫెస్ట్-2024'

ప్రజాశక్తి-గుంటూరు

రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వారం రోజులపాటు నిర్వహించే 'రోటో ఫెస్ట్-2024' క్రీడోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడోత్సవాల ప్రారంభంలో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి బెలూన్లు ఎగురవేసి మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను మానసిక ధైర్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి సంవత్సరం అంతర్జాతీయంగా రోటోఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. క్లబ్ అధ్యక్షులు గాలి సుబ్బారావు మాట్లాడుతూ అంతర్జాతీయంగా విస్తరించిన రోటరీ క్లబ్స్ ద్వారా సామాజిక ఆరోగ్య చైతన్య కార్యక్రమాలతో పాటు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, మంచినీరు, క్రీడా పరికరాలు, బెంచీలు సమకూర్చడంతో పాటు వారి శారీరక దఢత్వానికి రోటో ఫెస్ట్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలిరోజు కార్యక్రమంలో100 మీటర్లు, రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, 100 మీటర్స్ రిలేరన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. సోమవారం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పిఎస్ కార్తికేయన్ హీరేన్ సంఘవి, క్లబ్ నెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ కాలేజీకి రెడ్‌క్రాస్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు



అవార్డు అందుకుంటున్న కాలేజి ప్రతినిధులు

యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమాలను, రక్తదాన శిబిరాల నిర్వహణలో మెరుగైన ప్రతిభ చూపినందుకుగాను గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల అవార్డు అందుకుంది. రెడ్‌క్రాస్ జిల్లా వార్షిక సమావేశంలో కలెక్టర్ చేతుల మీదుగా కళాశాల ప్రతినిధి, కెమిస్ట్రీ విభాగాధిపతి బి.జాయిస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ. ఆదిలక్ష్మి అవార్డు అందుకున్నారు.

సజావుగా వర్సిటీ దూర విద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ పరీక్షలు ఆదివారం సజావుగా ప్రారంభమైనట్లు దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామ చంద్రన్ తెలిపారు. ఆంధ్ర రాష్ట్రమంతటా 114 పరీక్ష కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించినట్లు రామచంద్రన్ తెలిపారు. అదేవిధంగా వర్సిటీ దూరవిద్య కేంద్రంలో ప్రత్యేక విద్యార్థి సహాయ కేంద్రం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలను పరిష్కరించినట్లు వివరించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నేడు ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలైన త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863-2224202 నంబర్‌కు ఫోన్ చేస, కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చున్నారు. అనంతరం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1గంట వరకు గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

చెకుముకి సైన్స్ సంబరాల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ, జెవివి జిల్లా గౌర వాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను లక్ష్మణ రావు ప్రారంభించారు. జిల్లా నుండి దాదాపు 40 టీములు ఈ వేడుకల్లో పాల్గొన్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హిందూ కాలేజి సలహాదారు అబ్బరాజు రాజశేఖర్ మాట్లాడుతూ జెవివి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ చెకుముకి సైన్స్ సంబరాలలో 4 లక్షల మందికిపైగా విద్యార్థులను భాగస్వాముల్ని చేయటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు కె.శ్రీనివాస్, టి.ఆర్.రమేష్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, ఎస్.ఎం.సుభాని, బి.శంకర్ సింగ్, కె.సాయ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కొండవీడు పబ్లిక్ స్కూల్, విజేత పబ్లిక్ స్కూల్, వెంకటేశ్వరా బాలకుటీర్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఎపిఆర్ఎస్ తాడికొండ, జలగం రామారావు నగరపాలక ఉన్నత పాఠశాల, తాడేపల్లి జెడ్పీ హైస్కూల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.



హాజరైన విద్యార్థులు, జెవివి నాయకులు

దోమల నివారణకు ప్రజల సహకారం అవసరం

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులతో పాటు వైరల్ ఫీవర్లకు గురికాకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలపై ప్రజాశక్తికిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

- **దోమతెరలు, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ**
- **70 వేల దోమ తెరలకు ప్రభుత్వానికి నివేదిక**
- **ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా జ్వర నిర్ధారణ పరీక్షలు, చికిత్స**
- **ప్రజాశక్తితో పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్**

డెంగీ,మలేరియా, చికున్ గున్యా నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం చేపడుతున్నాం. డెంగీ జ్వరం అనేది ఈడిస్ ఈజిప్ట అనే దోమ ద్వారా వ్యాపించే ఒక అంటు వ్యాధి. దోమ కాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా, చికున్ గున్యా, విష జ్వరాలు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సూపర్ వైజర్లు ఇంటింటి సర్వే నిర్వహి స్తున్నారు.

దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

జిల్లాలో ఏయే ప్రాంతాల్లో మురుగునీరు ఎక్కువ నిల్వ ఉంటుందో వాటిని తొలగించేందుకు చర్యలలో భాగంగా దోమల లార్వాలను నాశనం చేసేందుకు 1.50 లక్షల చేప పిల్లలను మురుగు కాల్వల్లో వేశాము. దోమల నివారణకు ప్రజల సహకారం అవసరం. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మురుగు కాల్వలలో చెత్త చెదారం వేయకుండా, ఇంట్లోని పనికిరాని వస్తువులను తొలగించడం ద్వారా దోమలను కొంతమేర నివారించొచ్చు.

వ్యాధుల లక్షణాలు ఏమిటి? నిర్ధారణ పరీక్షలు ఎక్కడ చేస్తున్నారు?

డెంగీ, మలేరియా జ్వరం లక్షణాలు రోగి వయసుపై ఆధార పడి ఉంటాయి. అధిక జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, నీరసం, తలనొప్పి, అలసట, ఆకలి మందగించడం, కళ్ల వెనుక నొప్పి వంటి లక్షణాలు ఆయా వ్యాధులు సోకిన వారిలో ఉంటాయి. సాధారణ జ్వరాల బారిన పడిన వారికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. డెంగీకి 'ఎలీసా' పరీక్షల ద్వారా నిర్ధారించి అనంతరం చికిత్స అందిస్తారు.

ఇప్పటి వరకు ఎన్ని రక్త నమూనాలు సేకరించారు?

వైరల్ జ్వరాలు సోకిన వారి నుండి ఇప్పటి వరకు 1.40 లక్షల మందికి పైగా నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించగా 259 డెంగీ, 18 చికెన్ గున్యా, 2 మలేరియా కేసులు నమోదయ్యాయి.

వ్యాధి నిర్ధారణ అయిన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టారా? మరణాలు ఏమైనా సంభవించాయా?

కేసులు నిర్ధారణ అయిన ప్రాంతాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యటించి బాధితుల కుటుంబ సభ్యుల నుండి కూడా రక్త నమూనాలు సేకరించడం, పరీక్షలు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో అయితే జిల్లా పంచాయతీ, పట్టణ పరిధిలో అయితే మున్సిపల్ కమిషనర్‌కు అందజేసి వారి పర్యవేక్షణలో ఫాగింగ్, మురుగు కాల్వలలో పూడికతీత, పరిసరాలను శుభ్రం చేయించడం జరుగుతుంది.



కె.రవీంద్ర రత్నాకర్, పల్నాడు జిల్లా మలేరియా అధికారి



పల్నాడు జిల్లాలో దోమతెరలు పంపిణీ చేశారా ?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019లో ప్రభుత్వ పరంగా వచ్చిన 60 వేల దోమ తెరలను మొత్తం పల్నాడు జిల్లాలో పంపిణీ చేశాం. హైరిస్క్ కలిగిన ప్రాంతాలపై దోమల నివారణకు దోమతెరలు పంపిణీ చేశాం. మాచర్ల, కారంపూడి, బొల్లాపల్లి తదితర మండలాల్లోని గిరిజన, చెంచు కాలనీలో, దళితవాడలలో పంపిణీ చేశాం. ప్రస్తుతం పల్నాడు జిల్లాలో 70 వేల దోమతెరలు అవసరమని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. పేదల వాడల్లో ఉండే ప్రజలకు, జిల్లాలోని 137 ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నాం.

ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తున్నారు?

పరిసర ప్రాంతాలలో వర్షపు నీరు, మురుగు నీరు, నిల్వ లేకుండా ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. పొరపాటున ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నిలువ ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వాటిని తొలగించి దోమల లార్వాలను నాశనం చేస్తున్నాం. మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పర్యటించి వ్యాధిగ్రస్తుల నుండి ఇంటి చుట్టుపక్కల ఉన్న వారి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ఉదయం సాయంత్రం సమయాల్లో చలి ప్రదేశాలలో తిరగ కూడదు. అదే సమయంలో ప్రజలు ఆయా వ్యాధుల భారిన పడకుండా ప్రజలను చైతన్య పరిచి దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది తెలియజేస్తున్నాం.

గంబూషియా చేపలతో దోమల నివారణ సాధ్యమేనా?

గంబూషియా చేప పిల్లలను మురుగు కాల్వలో వదలడం ద్వారా దోమల నివారణ సాధ్యమే. నీరు నిల్వ ప్రాంతాలలో,మురుగు నీటి నిల్వలలో దోమల లార్వా వద్ధి చెంది తద్వారా దోమలు ప్రబలి ప్రజలు ఆనారోగ్యంబారిన పడుతున్నారని మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ముందస్తుగా మురుగునీటి ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వా నిర్మిలించవచ్చు.

ప్రజల ఆరోగ్య సంరక్షణకు మీరిచ్చే సూచనలు?

డెంగీ, మలేరియా, ఫైలేరియా, టైఫాయిడ్, మెదడు వాపు వ్యాధులు దోమ కాటు వల్ల వ్యాపిస్తాయి. వీటితో పాటు కొత్తగా 'జికా' అని పిలువబడే కొత్త వైరస్ ఉత్తరప్రదేశ్, ఓడిశా తదితర రాష్ట్రంలలో విజృంభించింది. ప్రజలు చిన్నారులు దోమకాటుకు గురి కాకుండా విధిగా దోమ తెరలు వినియోగం వలన 90 శాతం ఆయా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. కొద్ది వారాలుగా చికున్ గున్యా, డెంగీ, మలేరియా జ్వరాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఆయా వ్యాధులు ప్రాణాతకం కాకపోయినా అశ్రద్ధ చేయకుండా వైద్యుల సూచన మేరకు చికిత్స పొందడం శ్రేయస్కరం.

(ప్రజాశక్తి-పల్నాడు జిల్లా)